ప్రశాంతంగా ఎస్‌ఎంసీ ఎన్నికలు



ఓజిలి: ఆర్మేనిపాడులో ఎస్‌ఎంసీ ఎన్నికలను నిర్వహిస్తున్న హెచ్‌ఎం వెంకటేశ్వర్లు

ఓజిలి: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్‌ఎంసీ) ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో ముగిసినట్లు ఎంఈవో శైలజ తెలిపారు. మండలంలో 64 ప్రాథమిక, 2 ప్రాథమికోన్నత, 5 ఉన్నత పాఠశాలల్లో చైర్మన్, వైస్ చైర్మన్లను ఏకగ్రీంగా ఎన్నికయ్యారు. పలు పాఠశాలల్లో ఎన్నికలను ఎంఈవో పర్యవేక్షించారు. కార్యక్రమంలో కుందాం పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కనుమూరు గోపాల్‌రెడ్డి, ఎల్లు గురుమూర్తి, అనీల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ కొండూరు ఈశ్వర్‌రాజు, నాయకులు మన్మథయ్య, అశోక్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

సైదాపురంలో..

సైదాపురం : మండలంలో 73 ప్రాథమిక, 6 ప్రాథమికోన్నత, తొమ్మిది ఉన్నత పాఠశాలల్లో గురువారం ప్రశాంతంగా ఎస్‌ఎంసీ ఎన్నికలు నిర్వహించారు. 72 ప్రాథమిక, 6 ప్రాథమికోన్నత, 8 ఉన్నత పాఠశాలల్లో కమిటీ చైర్మన్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు ఎంఈవో దయాకర్ తెలిపారు. గిద్దలూరు ఉన్నత, నాలుగు ప్రాథమిక పాఠశాలల్లో వివాదాలు జరగకుండా ఎస్ఐ డీఎస్ విజయ్‌కుమార్ బందోబస్తు ఏర్పాటుచేశారు. కొమ్మిపాడు పాఠశాలలో విద్యార్థులు లేకపోవడంతో అక్కడ ఎన్నికలు జరగలేదు. సైదాపురం ఉన్నత పాఠశాలల్లో కోరం లేక ఎన్నికను వాయిదా వేసినట్లు ఎంఈవో తెలిపారు.

దొరవారిసత్రంలో..

దొరవారిసత్రం : మండలంలోని 65 పాఠశాలలకు గాను 58 పాఠశాలల్లో గురువారం ఎస్‌ఎంసీ ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. 7 పాఠశాలల్లో ఎన్నికల జరిగాయి. పలు పాఠశాలల్లో ఎన్నికల తీరును స్థానిక ఎంఈవో కృష్ణయ్య పరిశీలించారు. 51 ప్రాథమిక, 5 ప్రాథమికోన్నత, 6 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలతో పాటు డీవీ సత్రంలోని కేజీబీవీ, బీసీ గురుకులం, మావిళ్లపాడులోని ఆదర్శ పాఠశాలలో ఎస్‌ఎంసీ ఎన్నికలు జరిగాయి.

రాపూరులో..

రాపూరు: మండలంలో 62 ప్రాథమిక, 7 ప్రాథమికోన్నత, 7 ఉన్నత పాఠశాలలు, 2 గురుకుల పాఠశాలల్లో గురువారం ప్రశాంత వాతావరణంలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగినట్లు ఎంఈవో శ్రీనివాసులు తెలిపారు. రాపూరు తూర్పు అగ్రహకట్టలో వైఎస్సార్ సీపీ బలపరిచిన పంతగిరి నాగమణి చైర్మన్‌గా, పోలమ్మ వైస్ చైర్మన్‌గా 13 మంది కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు.

62 పాఠశాలల్లో ఏకగ్రీవం

వాకాడు : మండలంలోని 62 పాఠశాలల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎంఈవో నసీంఅలీ మాట్లాడుతూ 61 ప్రాథమిక పాఠశాలలకు గాను 55 పాఠశాలల్లో ఏకగ్రీవమైనట్టు తెలిపారు. 6 పాఠశాలల్లో ఎన్నిక జరిగిందని పేర్కొన్నారు. నాలుగు ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఏకగ్రీవం కాగా, ఒకదాంట్లో ఎన్నిక జరిగిందని వివరించారు. 3 హైస్కూళ్లలో ఎన్నిక జరిగిందని వెల్లడించారు.

చిల్లకూరులో..

చిల్లకూరు : మండలంలో 72 పాఠశాలలు ఉండగా 20 పాఠశాలల్లో ఎన్నికలు జరిగాయి. రెండింటిలో ఎన్నికలను వాయిదా వేసారు. వీటిలో ఓడూరు ప్రాథమికోన్నత పాఠశాలలో కోరం ఉన్నప్పటికీ తమ మద్దతుదారులకు చైర్మన్ పదవి కావాలనే సాకుతో టీడీపీ నేతలు హెచ్‌ఎం శ్రీధర్‌పై ఒత్తిడి తీసుకువచ్చి ఎన్నికను వాయిదా వేయించారు. అలాగే పారిచెర్లవారిపాళెం జెడ్పీ హైస్కూల్‌లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు ఎంపిక కాగా టీడీపీ నేతలు అడ్డు చెప్పి మళ్లీ ఎన్నిక నిర్వహించాలని పట్టుబట్టారు. దీంతో ఆ ఎన్నికను హోల్డ్‌లో ఉంచారు.

వాకాడు మండలం బాలిరెడ్డిపాళెం జెడ్పీ హైస్కూల్‌లో వైఎస్సార్ సీపీ మద్దతుదారుడు ఎన్నిక ప్రక్రియ పూర్తి అయిన తర్వాత టీడీపీ నియోజకవర్గ ప్రజాప్రతినిధి హెచ్‌ఎంకు ఫోన్ చేసి ఎన్నికను వాయిదా వేయాలని ఆదేశించినట్టు తెలిసింది.

పాఠశాల ఎన్నికల్లోనూ టీడీపీ నేతల రాజకీయం

- గ్రామస్తులు అడ్డుకోవడంతో ఎన్నిక వాయిదా



తుమ్మూరు ప్రాథమిక పాఠశాలలో సమావేశమైన విద్యార్థుల తల్లిదండ్రులు

తడ: విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుతోపాటు పాఠశాలల అభివృద్ధిలో తల్లిదండ్రులను భాగస్వాములను చేసేందుకు ఉద్దేశించిన మేనేజ్‌మెంట్ కమిటీల్లోనూ టీడీపీ నేతలు రాజకీయం చేయడానికి ప్రయత్నించారు. పాఠశాలల్లో గురువారం స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు నిర్వహించారు. మండలంలోని వాటంబేడు కుప్పం ప్రాథమిక పాఠశాలలో ఎన్నిక నిర్వహణకు తల్లిదండ్రులు వచ్చారు. ఎన్నిక ప్రక్రియ మొదలు కాగానే టీడీపీ నాయకులు సూచించిన వ్యక్తి పేరును హెచ్‌ఎం ఏకపక్షంగా ప్రకటించారు. దీంతో తల్లిదండ్రులు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనిపై వివాదం ముదరడంతో పాఠశాల వద్ద ఘర్షణ వాతావరణం నెలకొంది. విషయం జిల్లా కలెక్టర్ దృష్టికి వెళ్లడంతో కోరం లేదనే సాకు చూపి ఎన్నికను తాత్కాలికంగా వాయిదా వేశారు. మండలంలోని మొత్తం 49 పాఠశాలలకు గాను కారిజాత, ఆనపగుంట, కేజీబీవీ పాఠశాలల్లో మాత్రం ఓటింగ్ ద్వారా కమిటీలను ఎన్నుకున్నారు. మిగిలిన చోట్ల ఏకగ్రీవంగా ఎన్నికలు ముగిశాయి.

నాయుడుపేటలో.. నాయుడుపేట టౌన్ : నాయుడుపేట మండలంలో గురువారం ప్రభుత్వ పాఠశాలల్లో జరిగిన ఎస్‌ఎంసీ ఎన్నికల్లో టీడీపీ నేతలు రాజకీయం చేశారు. విన్నమాల, అన్నమేడు, కూచివాడ, గొట్టిప్రోలు తదితర పాఠశాలల్లో టీడీపీ నేతలు తమ వర్గం వారిని ఏకపక్షంగా ఎంపిక చేసుకున్నారు. మండలంలోని 62 ప్రాథమిక, 4 ప్రాథమికోన్నత, 9 ఉన్నత పాఠశాలలు, 3 గురుకులాలకు సంబంధించి స్కూల్ మేనేజ్ మెంట్ కమిటీలను నిబంధనల మేరకు ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు ఎంఈవో మునిరత్నం వెల్లడించారు.

గూడూరులో చెదురు మదురు ఘటనలు

చిల్లకూరు : గూడూరు, చిల్లకూరు మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం నిర్వహించిన ఎస్‌ఎంసీ ఎన్నికల్లో చెదురు మదురు ఘటనలు చోటు చేసుకున్నాయి. రెండు పాఠశాలల్లో ఎన్నికలను వాయిదా వేశారు. ఒక పాఠశాలలో టీడీపీ నేతల ఒత్తిడితో డీలర్‌ను ఎంపిక చేశారు. దీనిపై తల్లిదండ్రులు అభ్యంతరం వ్యక్తంచేయడంతో మరొకరిని ఎంపిక చేసుకునేలా అధికారులు రేపటికి వాయిదా వేశారు. గూడూరు మండలంలో 67 ప్రాథమిక, 8 యూపీ, 14 హైస్కూళ్లు ఉండగా 66 ప్రాథమిక, 7 యూపీ, 12 హైస్కూళ్లలో కమిటీలు ఏకగ్రీవమయ్యాయి. ఒక ప్రాథమిక, ఒక యూపీ, 2 హైస్కూళ్లలో ఎన్నికలు నిర్వహించారు.



ఓజిలి: అత్తివరంలో ఎన్నికైన విద్యాకమిటీ సభ్యులతో ఉపాధ్యాయులు



సైదాపురం : దాడిశెట్టిపల్లి ప్రాథమిక పాఠశాలలో చైర్మన్‌తో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న హెచ్‌ఎం



చిల్లకూరులోని గురుకుల బాలుర పాఠశాలలో తల్లిదండ్రులతో ప్రిన్సిపాల్ అనీల్‌కుమార్



వాకాడు : ఎస్‌ఎంసీ ఎన్నికల్లో పాల్గొన్న విద్యార్థుల తల్లిదండ్రులు

క్లుప్తంగా

రోడ్డును బాగు చేయాలని నిరసన



నిరసన తెలియజేస్తున్న విద్యార్థి సంఘం నేతలు

సైదాపురం: సైదాపురం –డేగపూడి వరకు అధ్వానంగా ఉన్న రోడ్డును బాగు చేయాలని ఏఐఎస్‌ఏ విద్యార్థి సంఘం నాయకులు గురువారం నిరసన తెలిపారు. మండల కేంద్రమైన సైదాపురం పోలీసు స్టేషన్ ఎదురుగా అధ్వానంగా ఉన్న రోడ్డుపై కుర్చీలు వేసుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘం నాయకుడు షఫీ హరర్ మాట్లాడుతూ రోడ్డు అధ్వానంగా మారడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం స్పందించి రోడ్డును బాగు చేయాలని, లేనిపక్షంలో నిరాహార దీక్ష చేపడతామన్నారు.

పశువులకు గొంతు వ్యాధి టీకాలు



రైతులకు మందులు అందజేస్తున్న పశువైద్యులు

రాపూరు: మండలంలోని సిద్ధవరంలో గురువారం వెటర్నరీ పాలిటెక్నిక్ విద్యార్థుల ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పశువులకు గొంతువ్యాధి టీకాలు వేశారు. గొర్రెలకు నట్టల నివారణ మందులు ఇచ్చారు. రైతులకు మందులు అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ శ్రీహరి మాట్లాడుతూ పశుసంవర్థక పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు ఇంటర్న్‌షిప్‌లో భాగంగా మండలంలో ఉచిత పశువైద్య శిబిరాలను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సంక్రాంతిపల్లి పశువైద్యాధికారి సుప్రజ, రాజేష్, కళాశాల సిబ్బంది విశాలి, పెంచలరెడ్డి, మనోహర్‌రెడ్డి, అఖిల్ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలి



శిక్షణలో పాల్గొన్న సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు

చిల్లకూరు : పంచాయతీ కార్యదర్శులు సర్పంచులతో కలిసి గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీడీవో భానుమూర్తి ఆదేశించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు మూడు రోజుల శిక్షణ ప్రారంభమైంది. ఆయన మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులకు ప్రతిపాదనలను తయారుచేసి ప్రభుత్వానికి పంపితే నిధులు మంజూరవుతాయన్నారు. ఈవోపీఆర్‌డీ మాణిక్యం, శిక్షకులు గరుడయ్య తదితరులు పాల్గొన్నారు.

వయనాడ్ బాధితులను ఆదుకోవాలి



విరాళాలు సేకరిస్తున్న సీపీఎం నాయకులు

గూడూరు రూరల్ : కేరళ రాష్ట్రం వయనాడ్‌లోని బాధితులను ఆదుకోవాలని సీపీఎం నాయకులు కోరారు. వారు గురువారం గూడూరు పట్టణంలో వయనాడ్ బాధితుల కోసం విరాళాలు సేకరించారు. వైఎస్సార్ సీపీ సీఈసీ సభ్యుడు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి తన వంతు సాయంగా రూ.10 వేలు అందజేశారు. సీపీఎం నాయకులు మాట్లాడుతూ మానవత్వం ఉన్న ప్రతి ఒక్కరూ వయనాడ్‌లో జరిగిన అల్లకల్లోలాన్ని గుర్తించి బాధితులను ఆదుకోవాలని కోరారు. విరాళాల సేకరణ సందర్భంగా తొలి రోజు గురువారం రూ.13,600 సేకరించినట్టు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యుడు శ్రీనివాసులు, గూడూరు శాఖ కార్యదర్శి జోగి శివకుమార్, సీఐటీయూ నాయకులు వెంకటరామిరెడ్డి, బీవీ రమణయ్య, ఎస్.సురేష్, పుట్టా శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

విరాళాల సేకరణ



విరాళాలు సేకరిస్తున్న సీపీఎం నేతలు

నాయుడుపేట టౌన్ : కేరళ రాష్ట్రంలోని వయనాడ్ బాధితుల సహాయార్థం సీపీఎం నాయకులు గురువారం విరాళాలు సేకరించారు. తమ పార్టీ తరపున సేకరించిన మొత్తాన్ని అక్కడి సీఎం సహాయనిధికి పంపనున్నట్లు శివకవి ముకుంద తెలిపారు. ఎస్‌ఎఫ్ఐ నేతలు ఉదయ్ కుమార్, వరప్రసాద్, మనోజ్‌కుమార్, సీఐటీయూ నేతలు పోలమ్మ, రాణెమ్మ భాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు

కండలేరులో 6.022 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో గురువారం నాటికి 6.022 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సత్యసాయి గంగ కాలువకు 120, లోలెవల్ కాలువకు 20 క్యూసెక్కు ల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

చేపల చెరువు వేలం వాయిదా

ఓజిలి: మండలంలోని మాచవరం సచివాలయంలో చేపల చెరువు వేలంపాటలను వాయిదా వేసినట్టు పంచాయతీ కార్యదర్శి పెద్ద మస్తానయ్య తెలిపారు. వేలంలో పాల్గొనే వారు సచివాలయంలో డిపాజిట్లు చెల్లించాలని గ్రామస్తులను కోరగా వారు చెరువు వేలంపాటలు నిర్వహించరాదని అడ్డుకున్నారని తెలిపారు. ఈ క్రమంలో గ్రామంలో శాంతిభద్రతల సమస్య తలెత్తడంతో చేపల చెరువు వేలం పాటలను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించామని పేర్కొన్నారు. వేలం పాటల నిర్వహణ ఎప్పుడు చేపడతామన్న విషయాన్ని త్వరలో తెలియజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ పిండుకూరు మౌనిక తదితరులు పాల్గొన్నారు.

సర్వే పనుల పరిశీలన

చిల్లకూరు : మండలంలోని తీర ప్రాంతంలో చెన్నై–బెంగళూరు కోస్టల్ కారిడార్ కోసం సేకరించిన భూముల సర్వేను గురువారం గూడూరు ఆర్డీవో కిరణ్‌కుమార్ పరిశీలించారు. 15 రోజుల క్రితం నాలుగు సర్వే బృందాలను నియమించి సుమారు 914 ఎకరాల భూమిని సర్వే చేశారు. కొన్ని బృందాలు సర్వే పూర్తి చేసినా నివేదికలు ఇవ్వలేదు. మిగిలిన సర్వే బృందాల పనితీరుపై ఆర్డీవో ఆరా తీశారు. సర్వే నత్తనడకన సాగుతుండడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు రోజుల్లో పూర్తి చేసి నివేదికలు ఇవ్వాలని ఆదేశించారు. ఆయన వెంట తహసీల్దార్ శ్రీనివాసులు ఉన్నారు.

పర్యావరణాన్ని కాపాడుకుందాం

కోట: పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని సూళ్లూరుపేట డిగ్రీ కళాశాల అధ్యాపకుడు శ్రీనివాస్ తెలిపారు. విద్యానగర్ ఎన్‌బీకేఆర్ సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాలలో గురువారం ఎన్విరాన్‌మెంటల్ ఎథిక్స్ అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఇందులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. ప్రకృతి విపత్తులు పెరగడానికి కారణం పర్యావరణ సమతుల్యత దెబ్బతినడమేనన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రామక్రిష్ణారెడ్డి, కోఆర్డినేటర్ రాజేష్, గాది శ్రీనివాసులు, రాజ తదితరులు పాల్గొన్నారు.

నాగార్పమ్మ ఆలయంలో చోరీ

సూళ్లూరుపేట రూరల్ : సూళ్లూరుపేట మండలంలోని జంగాలపల్లిలో ఉన్న నాగార్పమ్మ ఆలయంలో మంగళవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు చొరబడి అమ్మవారి నగలను చోరీ చేశారు. ఆలయంలో అమ్మవారికి సంబంధించిన 8 సవర్ల కాసుల దండ, నాలుగు సవర్ల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్టు గ్రామస్తులు తెలిపారు. హుండీని పగులగొట్టి సుమారు రూ.30 వేల నగదును చోరీ చేశారు. ఉదయం గ్రామస్తులు ఆలయంలో చోరీ జరిగినట్లు గుర్తించి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఆలయాన్ని పరిశీలించి విచారించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నూతన వధూవరులకు ఆశీర్వాదం



వధూవరులను ఆశీర్వదిస్తున్న నేదురుమల్లి

రాపూరు: మండలంలోని పెంచలకోనలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో గురువారం వెలుగోను గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు గడ్డం వెంకటరమణారెడ్డి, రేవతి దంపతుల కుమార్తె గాయత్రి, శరణ్‌రెడ్డి వివాహం జరిగింది. ఇందులో వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ పాల్గొని వధువరులను ఆశీర్వదించారు. అంతకుముందు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి రాపూరు బస్టాండ్‌లో టీ హోటల్‌లో నాయకులతో కలిసి టీ తాగుతూ సరదాగా గడిపారు. వైఎస్సార్ సీపీ రైతు సంఘ కార్యదర్శి బత్తిన పట్టాభిరామిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ దందోలు నారాయణరెడ్డి, తిరుపతి పార్లమెంట్ మైనార్టీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఖాదర్‌బాషా, నెల్లూరు రవీంద్రారెడ్డి, సుబ్బారెడ్డి, సంజీవరెడ్డి, మురళీమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపో వద్ద ఎన్‌ఎంయూ నేతల నిరసన



నిరసన తెలుపుతున్న ఎన్‌ఎంయూ నాయకులు

గూడూరు రూరల్ : ఆర్టీసీ డిపోల మేనేజర్ల నిరంకుశ వైఖరిపై ఎన్‌ఎంయూ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వారు గురువారం గూడూరు ఆర్టీసీ డిపో ఎదుట నిరసన తెలిపారు. ఎన్‌ఎంయూ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి చెంచులయ్య మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికుల పట్ల డిపో మేనేజర్లు ఇష్టాను సారంగా వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. అసభ్య పదజాలంతో దూషిస్తున్నారని, ఇదే విధంగా కొనసాగితే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. మహిళా ఉద్యోగులకు నెలలలో మూడు రోజులు సెలవులు ఉండగా, వాటిని ఇవ్వడం లేదన్నారు. డిపో మేనేజర్లు కార్మికుల పట్ల స్నేహపూర్తిగా వ్యవహరించాలని ఉన్నతాధికారులు పదే పదే చెబుతున్నా ప్రయోజనం లేదన్నారు. కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శేఖర్, వెంకటరామయ్య, శ్రావణ్, ఎస్‌కే బాషా, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఈశ్వరాలయ జీర్ణోద్ధరణకు భూమి పూజ



శిథిలావస్థలో ఉన్న ఈశ్వరాలయం

నాయుడుపేట టౌన్ : మండలంలోని పుదూరు సమీపంలో పొలాల్లో శిథిలావస్థలో ఉన్న ప్రణవ బ్రహ్మసూత్ర ఈశ్వర ఆలయం జీర్ణోద్ధరణకు శుక్రవారం భూమి పూజ చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సుమారు ఐదు వందల ఏళ్లనాటి ఈ ఆలయ జీర్ణోద్ధరణకు గ్రామ పెద్దలు, యువకులు ముందుకు వచ్చారు. పురాతన ఆలయ జీర్ణోద్ధరణకు గ్రామస్తులు ముందుకు రావడం శుభాపరిణామమని ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు తెలిపారు.

ప్రారంభానికి నోచుకోని విలేజ్ హెల్త్ క్లినిక్





అద్దె ఇంటిలో వైద్య సేవలందిస్తున్న ఎంఎల్‌హెచ్‌పీ శివగాయత్రి, విలేజ్ హెల్త్ క్లినిక్ భవనం

దొరవారిసత్రం: గ్రామాల్లోని రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు గత ప్రభుత్వం గ్రామ సచివాలయం వద్ద విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలను నిర్మించింది. ఒక్కొక్క భవనానికి రూ.17.50 లక్షలు వెచ్చించింది. మండలంలోని పోలిరెడ్డిపాళెం సచివాలయం వద్ద నూతన హంగులతో భవనాన్ని నిర్మించింది. దీనిద్వారా పోలిరెడ్డిపాళెం, గొల్లపాళెం, సూరపు అగ్రహారం, అక్కరపాక, ముత్రాసపాళెం తదితర గ్రామాల ప్రజలకు వైద్యం అందుతుంది. ప్రస్తుతం పోలిరెడ్డిపాళెం ఎస్టీ కాలనీలోని ఒక ఇంటిలో ఎంఎల్‌హెచ్‌పీ శివగాయిత్రి రోగులకు వైద్య సేవలు అందిస్తున్నారు. నిర్మాణం పూర్తయినా విలేజ్ హెల్త్ క్లినిక్‌ను అధికారులు ప్రారంభించలేదు. భవనం ముందు పిచ్చి మొక్కలు పెరిగాయి. దీనిపై డీవీ సత్రం పీహెచ్‌సీ వైద్యాధికారి చైతన్య, పంచాయతీ కార్యదర్శి మునికృష్ణ వివరణ ఇస్తూ కాంట్రాక్టర్‌తో మాట్లాడి విలేజ్ హెల్ క్లినిక్ భవనానికి నీటి సదుపాయం కల్పించి ప్రారంభిస్తామన్నారు.

నిర్మాణ పనులను అడ్డుకున్న అధికారులు



చంద్రబాబు కాలనీకి వెళ్లే రోడ్డు అనుకుని నిర్మాణాలు చేస్తున్న రియల్టర్లు

నాయుడుపేట టౌన్: పట్టణ పరిధిలోని చంద్రబాబు కాలనీ సమీపంలోని పొలాల వద్ద మున్సిపల్ రోడ్డుకు అనుకుని చేస్తున్న నిర్మాణాలను గురువారం స్థానిక టౌన్ ప్లానింగ్ సచివాలయ అధికారులు అడ్డుకున్నారు. ఇక్కడి పొలాల వద్ద అనుమతులు లేకుండా రియల్టర్లు ప్లాట్లు వేస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న సచివాలయ అధికారులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. మున్సిపల్ రోడ్డును ఆక్రమించుకుని ప్రహరీ గోడ నిర్మిస్తున్నట్టు గుర్తించారు. పొలాలకు సంబంధించిన డ్యాక్యుమెంట్లు తీసుకొచ్చి సర్వే చేయించుకుని తర్వాత పనులు చేసుకోవాలని సూచించారు.

ముగిసిన చెల్లాతమ్మ జాతర



చెల్లాతమ్మ గ్రామోత్సవం నిర్వహిస్తున్న గ్రామస్తులు

తడ: మండలంలోని కారూరు గ్రామంలో గ్రామ దేవత చెల్లాతమ్మ జాతర గురువారం ప్రశాంతంగా ముగిసింది. గురువారం తెల్లవారు జామున అమ్మవారిని విశేషంగా అలంకరించి గ్రామోత్సవం చేపట్టారు. అమ్మవారి ప్రభ మధ్యాహ్నం గ్రామ నడిబొడ్డున ఉన్న పోలేరమ్మ గుడి వద్దకు చేరడంతో జాతర ముగిసింది. గ్రామోత్సం బయలు దేరే సమయంలో గ్రామంలో టీడీపీ, వైఎస్సార్ సీపీ నాయకుల మధ్య కొంత ఘర్షణ వాతావరణం నెలకొంది. పోలీసులు సకాలంలో గ్రామానికి చేరుకుని సర్ది చెప్పడంతో గ్రామోత్సవం ఆలస్యంగా మొదలైనా సజావుగా సాగింది.

లీలామోహన్‌రెడ్డి కుటుంబానికి పరామర్శ



లీలామోహన్‌రెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

రాపూరు: మండలంలోని పెనుబర్తికి చెందిన కొప్పుల లీలామోహన్‌రెడ్డి కుటుంబానికి అండగా ఉంటామని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. లీలామోహన్‌రెడ్డి(46) మంగళవారం రాత్రి గుండెపోటుతో నెల్లూరులో మృతిచెందారు. ఆయన నెల్లూరు క్లబ్‌కు జరుగుతున్న ఎన్నికల్లో పోన్నవోలు సుధాకర్‌రెడ్డి ప్యానల్‌లో సభ్యుడిగా పోటీ చేస్తున్నారు. నెల్లూరు క్లబ్‌లో ఉండగానే గుండెపోటు రావడంతో బొల్లినేని వైద్యశాలకు తరలించారు. అక్కడ ఆయన మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి గురువారం పెనుబర్తిలోని ఆయన గృహనికి చేరుకుని పార్థివదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఆయన వెంట ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు పాపకన్ను మధుసూదన్‌రెడ్డి, రాష్ట్ర రైతు సంఘ కార్యదర్శి బత్తిన పట్టాభిరామిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ దందోలు నారాయణరెడ్డి, తిరుపతి పార్లమెంట్ మైనార్టీ కార్యదర్శి డాక్టర్ ఖాదర్‌బాషా, మనోహర్‌రెడ్డి, మధురెడ్డి, శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా వంట గది





శిథిలావస్థకు చేరిన గదిలోనే వంట చేస్తున్న సిబ్బంది, నిరుపయోగంగా ఉన్న వంట గది

దొరవారిసత్రం : నెలబల్లి ప్రాథమిక పాఠశాలలో ఉన్న వంట గది నిరుపయోగంగా మారింది. మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు వంట గదిలో కాకుండా శిథిలావస్థలో ఉన్న భవనంలో అపరిశుభ్ర వాతావరణం నడుమ వంట చేస్తున్నారు. పాఠశాలలో 50 మందికి పైగా విద్యార్థులు ఉన్నారు. వంట గదికి కిటికీ లేదన్న నెపంతోనే దాన్ని వినియోగించడం లేదని ఉపాధ్యాయులు తెలిపారు.

నీలకంఠేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ట



నీలకంఠేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ట

పెళ్లకూరు: మండలంలోని చెంబేడు గ్రామంలో నిర్మించిన గురువారం సాయంత్రం నీలకంఠేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ప్రాంగణాన్ని చలువ పందిళ్లు, మామిడి తోరణాలు, విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. మేళతాళాలు, వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ హోమం చేశారు. అనంతరం కలశ స్థాపన, అర్చనలు చేశారు. ఆలయ అర్చకులు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు బెల్లపు వెంకటరాఘవరెడ్డి, లాయర్ ప్రభాకర్‌రెడ్డి, మహేష్‌రెడ్డి, మహీంద్రరెడ్డి, రాజా వైదీశ్వరశర్మ, శేషయ్య, వంశీరెడ్డి, జనార్ధన్ ఆచారి, చిరంజీవి, యోగీశ్వరయ్య, గోపి, చిన్నయ్య, శివయ్య, మునిరాజా, కమలాకర్, చంద్రయ్య పాల్గొన్నారు.